

ఇంధన పొదుపుపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి- జి.మాడుగుల: మండలం కేంద్రంలో శనివారం విద్యుత్ శాఖ ఆధ్వర్యం లో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయం నుండి ప్రధాన కూడలి వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. ఎల్ ఈ డీ బల్బులు వాడాలని, తక్కువ విద్యుత్ తో పని చేసే స్టార్ రేటింగ్ ఉన్న విద్యుత్ పరికరాలు ఉపయోగించాలని, అవసరం లేనప్పుడు ఇళ్లలో స్విచ్ లు ఆఫ్ చేయాలని కోరారు.ఏసీలు, వాటర్ హీటర్లు తక్కువగా ఉపయోగించాలని సిబ్బంది కోరారు. వాటర్ హీటర్లు బదులుగా సోలార్ వాటర్ హీటర్లు ఉపయోగించాలని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాజకుమార్, ఎంపిడిఓ డేవిడ్ రాజు, విద్యుత్ శాఖ ఏఈ యం. వెంకట రమణ, జేఈ పీ. సుబ్రమణ్యం, లైన్మన్లు మొహిద్దిన్, జోగిరాజు, దొర పాల్గొన్నారు.



ర్యాలీ చేపడుతున్న అధికారులు



'ఉపాధి హామీ'పై

కేంద్ర ప్రభుత్వం కుట్రలు

ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి-అరకులోయ, అరకులోయరూరల్ : 2005లో తీసుకొచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసేందుకే కేంద్రం ప్రభుత్వం కొత్త బిల్లు తీసుకొచ్చిందని, దీంతో ఆదివాసులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ తెలిపారు. ఆదివాసీ గిరిజన సంఘం మండల ఉపాధ్యక్షులు కిల్లో జగనాధం ఆధ్వర్యంలో అరకువేలి మండలం శరభగుడలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బాలదేవ్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఉపాధి హామీ చట్టం సవరణ బిల్లు చట్టమైతే ఉపాధి లేకుండా పోతుందన్నారు. కొత్త చట్టం ద్వారా పనిదినాలు 125 రోజులకు పెంచుతున్నట్లు కేంద్రం నమ్మబలుకుతోందన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో ఉపాధి హామీతో కాఫీ తోటల అభివృద్ధికి పీఎం జన్మన్ హౌసింగ్ పథకం నిర్మాణానికి పని దినాలు కల్పిస్తున్నారని, పోడు భూమి పట్టా ఉన్న వారికి 150 రోజులు పాటు పని కల్పిస్తున్నారన్నారు. కొత్త బిల్లు ప్రకారం 40 శాతం వాటా రాష్ట్రాలు ఇవ్వాలని పేర్కొనడం దారుణమన్నారు. పనులను నాలుగు రకాలుగా విభజించి యంత్రాలు, కాంట్రాక్టర్లకు ఉపాధి హామీగా మార్చనున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన వేతనాల కంటే రాష్ట్రాల్లో ఎక్కువ వేతనాలుంటే, అవే కనీస వేతనాలుగా ఉండాలని గత బిల్లులో పేర్కొన్నారని ఇప్పుడు కొత్త బిల్లులో దాన్ని రద్దు చేస్తున్నారని ద్రవ్యోల్బణం ఆధారంగా వేతనాలు పెరగాలనే నిబంధన కూడా తొలగించారని పేర్కొన్నారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఉపాధి హామీ కార్మికులు, ఆదివాసీలు పోరాటాలు ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల ఉపాధ్యక్షులు టి హరి, సహదేవ్ ,ప్రసాద్, గోపి రాము, బిదేసి నిల్లో పరశురాం, నీలాంబర్ దొన్ను, మహేష్, మోహన్, చంప కొండమ్మ, కాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు. ఫోటో రైట్ అప్ నిరసన వ్యక్తం చేస్తున్న దశ్యం



రాజవొమ్మంగిలో ఆందోళన చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

రాజవొమ్మంగి:

తాము చేసిన పనికి కూలి నగదు చెల్లించాలంటూ మండలంలోని చిన్నయ్యపాలెం గ్రామంలో శనివారం ఉపాధి వేతనదారులు నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఆదివాసీ నేత తెడ్ల రాంబాబు మాట్లాడుతూ గ్రామంలో గత 4 నెలలుగా వీరికి వేతనాలు చెల్లించపోవడంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పెండింగ్ వేతనలు తక్షణం చెల్లించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వేతనాలు ఇవ్వాలంటూ నినాదాలు చేశారు.కార్యక్రమంలో ఉపాధి వేతనదారులు పాల్గొన్నారు.

కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-అరుకులోయ:అరకులోయ ఆదివాసి గిరిజన సంఘం కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. స్థానిక తేజ మెడికల్స్ జనరల్ స్టోర్స్, ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో సంయుక్తంగా విశాఖపట్నంకు చెందిన శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సహకారం తో ఉచిత కంటి వైద్య శిభిరం నిర్వహించారు. ఇందులో సుమారు 146 మంది కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. 12 మందిని ఆపరేషన్‌కు గుర్తించారు. 16 మందికి కళ్ళ అద్దములు అవసరమని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శుభశ్రీ పండా, ఆసుపత్రి మేనేజర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



కంటిని పరీక్షిస్తున్న వైద్యురాలు

పోలియో చుక్కలు వేయించాలి

- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: .ఈ నెల 21న ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పల్స్ పోలియో కార్యక్రమం తొలి విడత ప్రారంభమ వుతుందని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ వెల్లడించారు. శనివారం పాడేరు ఐ.టి.డి.ఏ కార్యాలయ ఆవరణలో జెండా ఊపి పల్స్ పోలియో ర్యాలీ ని ప్రారంబించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పోలియో రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు గాను అప్పుడే పుట్టిన బిడ్డ నుండి 5 సంవత్సరాలలోపు చిన్నారులందరికి విధిగా పోలియో చుక్కలు వేయించాలని పిలుపునిచ్చారు. ఈనెల 21, 22, 23, తేదీల్లో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. 21న (ఆదివారం రోజు) పోలియో చుక్కలు వేయించుకోలేని పిల్లలకు ఈ నెల 22, 23 తేదీల్లో ఇంటింటి సర్వే నిర్వహించి వంద శాతం పోలియో చుక్కలు వేయడం పూర్తి చేయాలని ఆదేశించారు. అర్హులైన చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పోలియో చుక్కలు వేయించాలన్నారు. ప్రతి గ్రామంలో పల్స్ పోలియో కార్యాక్రమంపై గోడ ప్రతులు, బ్యానర్లు, పోస్టర్లు అతికించాలని తెలియజేసారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధి 64 ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలలో అర్హులైన 5 సంవత్సరాలు 1,29,959 మంది చిన్నారులను లక్ష్యంగా వ్యాక్సిన్ వేయడం జరుగుతుందన్నారు. ఇందుకు మొత్తం 2,506 బూత్ లను ఏర్పాటు చేసి 10,024 మంది వ్యాక్సినేటర్లు, 233 మంది పర్యవేక్షకుల ద్వారా నిర్వహించడం జరుగుతుందని, 37 ట్రాన్సిట్ పాయింట్లు, 74 సంచార బ బృందాలను అందుబాటులో ఉంచామన్నారు.39 హైరిస్క్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. 73 కోల్డ్ చైన్ యూనిట్లు సిద్ధం చేశామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కృష్ణమూర్తి నాయక్ తెలియజేసారు.ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ సభ్యురాలు గుమ్మ తనూజ రాణి, పాడేరు శాసనసభ్యులు మత్యరాస విశ్వేశ్వరరాజు, ఏం.ఎల్.సి కుంబ రవిబాబు, మాజీ శాసనసభ్యురాలు గిడ్డి ఈశ్వరి, యం.పి.పి ఎస్ రత్నాలమ్మ, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ టి.ఎన్ ప్రతాప్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి కమల కుమారి, జిల్లా కార్యక్రమ పర్యవేక్షణ అధికారి(ఎన్.ఎచ్.ఏం) కిరణ్ కుమార్, నైస్ పౌండేషన్ సంస్థ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శిల్ప, ప్రోగ్రాం అధికారి జగన్నాధరావు పాల్గున్నారు.



పాడేరులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

శతశాతం పూర్తి చేయాలి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కృష్ణమూర్తి నాయక్

డుంబ్రిగుడ:: జిల్లా వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కృష్ణమూర్తి నాయక్ అన్నారు. డుంబ్రిగుడ పీహెచ్సీలో ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్యాధికారులు నిర్వహించిన అత్యవసర సమావేశంలో హాజరైన ఆయన పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహణలో సిబ్బంది తీసుకోవాల్సిన చర్యలు, వ్యాక్సిన్ వయల్ మోనిటరింగ్ (వివి.యం) పోలింగ్ బూత్ల ఏర్పాటు, రిపోర్టుల నిర్వహణపై సూచనాలు చేశారు.

కొయ్యూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేవడుతున్న వల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాజేంద్రపాలెం వైద్యాధికారి జగదీష్ పిలుపునిచ్చారు. రాజేంద్రపాలెం పిహెచ్‌సి నుంచి గుడ్లపల్లి సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. 22, 23వ తేదీల్లో కూడా పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని స్పష్టం చేశారు.

రాజవొమ్మంగి: చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని వైద్యధికారి సుష్మా అన్నారు. రాజవొమ్మంగిలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. 21న చిన్నారులకు పోలియోచుక్కలు వేయించాలన్నారు. అల్లూరి కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఆశా వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీలేరు: జికె వీధి మండలం సీలేరు పిహెచ్‌సి పరిధిలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారి అఖిల్, హోమియో వైద్యాధికారి సృజనరాయి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మెయిన్‌రోడ్డు వద్ద మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ త్రినాథ, ఎఎన్ఎంలు, ఆశ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



రాజవొమ్మంగిలో ర్యాలీ చేపడుతున్న వైద్య సిబ్బంది

పిల్లలు బడికి వచ్చే విధంగా చూడాలి

ప్రజాశక్తి డుంబ్రిగుడ:- చిన్నారుల్లో విద్యా ప్రమాణాల మెరుగు పరచాలని మండల విద్యాశాఖ అధికారి 2 జి గెన్ను చెప్పారు. కిల్లోగుడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్లస్టర్ సమావేశాన్ని నిర్వహించామన్నారు. ప్రతిఒక్క చిన్నారి బడికి వచ్చే విధంగా చూడాలన్నారు. రికార్డుల నిర్వాహణతో పాటు పిల్లల హాజరు శాతాన్ని పెంచి విద్యాభివృద్ధిని పెంపొందించాలని చెప్పారు. సమయపాలన, చిన్నారుల్లో విద్యా ప్రగతియే లక్ష్యంగా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడతున్న ఎంఇఒ

నేడే అమరవీరుల సంస్మరణ సభ



పార్టీ జెండా ఎగురవేస్తున్న స్థానిక నాయకులు



సభకు జెండాలు సిద్ధం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు రాక

చింతూరుకు తరలిరానున్న ప్రజానీకం

ప్రజాశక్తి - చింతూరు

సిపిఎం అమరవీరుల సంస్మరణ సభకు ఉద్యమాల గడ్డ చింతూరు సిద్ధమైంది. ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు స్మారక సభ, ర్యాలీని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. యర్రంపేటలోని రచ్చబండ వద్ద ఎర్రజెండాలు కట్టారు. చుట్టు పక్కల మండలాలు, గ్రామాల నుంచి ప్రజలు ఎర్రంపేట గ్రామంలోని కల్లేరు జంక్షన్ వద్దకు ఆదివారం ఉదయం 11 గంటలకు చేరుకుని అక్కడ నుండి ర్యాలీగా ప్రారంభమై చింతూరు ప్రధాన కూడలి వద్దకు చేరుకోనున్నారు. అనంతరం పాత ప్రభుత్వాసుపత్రి ఆవరణలో సంస్మరణ సభ జరుగనుంది. ముఖ్య అతిథిగా సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం హాజరుకానున్నారు. వారితో పాటు తెలంగాణ రాష్ట్ర నాయకులు బండారు రవికుమార్, ఐద్వా సీనియర్ నాయకులు బి. హైమావతి పాల్గొననున్నారు.

స్మారక స్థూపాలకు రంగులు

మన్య ప్రాంత ఆదివాసీలకు అండగా నిలిచిన అమర వీరుల సంస్మరణ సభకు చింతూరు మండల కేంద్రంతో పాటుగా చుట్టు పక్కల ప్రాంతాల వారూ భారీగా తరలిరానున్నారు. ఈ ప్రాంతంలో అమరులైన పలువురు నాయకుల స్మారక స్థూపాలకు ఇప్పటికే రంగులద్దిన ప్రజలు పల్లెపల్లెనా ఎర్రజెండాలు కట్టారు. అమరవీరుల చిత్రపటాలను ఏర్పాటు చేశారు. ఆదివారం జరిగే సభకు సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ అధ్యక్షత వహించనున్నారు.

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన అమరవీరులు

పల్లె పల్లె నుండి కదులుదాం.. అమరవీరుల ఆశయ సాధనకై కదం తొక్కుదాం.. అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేద్దాం అని సిపిఎం చింతూరు మండల కమిటీ పిలుపునిచ్చింది. ఇక్కడి ప్రజలకు దోపిడీదారుల నుంచి నాటి సిపిఎం నేతలు విముక్తి కల్పించారు. ప్రాణాలు అర్పించి ప్రజల పక్షాన నిలబడ్డారు. తునికాకు సేకరణ మొదలు.. అటవీ ఉత్పత్తులపై ఆంక్షలు, కాంట్రాక్టర్ల దోపిడీ, లూటీలపై ఈ ప్రాంతంలో ఎర్రజెండా ఉద్యమించింది. ఆనాటి కాంగ్రెస్ పార్టీ, పీపుల్స్ వార్ నక్సల్స్ హత్యాకాండకు తెరతీయడంతో సిపిఎం నేతలు ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు పోలీసులు, ఫారెస్ట్ అధికారులు కలిసి నాయకులపై తప్పుడు కేసులు బనాయించారు. అడవిలో పశువులు మేస్తే గిరిజనులకు కఠిన శిక్షలు విధించారు. ఈ క్రమంలో ప్రజల కోసం సిపిఎం నాయకులు అలుపెరగని పోరాటాలు చేశారు. బత్తుల భీష్మారావు, చందర్రావు అమరులై చాలా సంవత్సరాలైంది. అయినప్పటికీ వారిరువురూ ప్రజల గుండెల్లో నేటికీ చిరస్థాయిగా ఉన్నారు. ఎర్రజెండా ముద్దుబిడ్డలైన కుంజా బొజ్జి, సున్నం రాజయ్య అసెంబ్లీ వేదికగా ప్రజల, గిరిజనుల గళం వినిపించారు. వారు అమరులైనప్పటికీ వారు చేసిన ఎన్నో మంచి పనులు ప్రజలను ఎర్రజెండాకు చేరువచేశాయి. ఆ ఎర్రజెండా ముద్దుబిడ్డల ఆశయ సాధనలో, వారి త్యాగాలను స్మరించుకుంటూ ఆదివారం అమరవీరుల సంస్మరణ సభను సిపిఎం ఆధ్వర్యాన చింతూరులో నిర్వహిస్తున్నారు.

పీసా చట్టం ఆవశ్యకతను వివరించండి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: పీసా చట్టం ఆవశ్యకతను గ్రామ ప్రజలకు వివరించాలని ఎంపిడిఓ లోకుల యాదగిరేశ్వరావు సచివాలయ సిబ్బందికి, వార్డు సభ్యులకు తెలిపారు. పీసా చట్టంపై అవగాహన శిక్షణలో భాగంగా మూడో స్థానిక ఎంపిడిఓ కార్యక్రమంలో సచివాలయ సిబ్బందికి, వార్డు సభ్యులు, మండలస్థాయి అధికారులతో పీసా చట్టంపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనర్స్, యంఒటి నాగేశ్వరరావు, విజయలక్ష్మి,గంగాధర్ మాట్లాడుతూ షెడ్యూల్ తెగల యొక్క సాంస్కతిక, సాంప్రదాయాలకు అనుగుణంగా రూపొందించిన చట్టమే పీసా చట్టం అని తెలిపారు. చిన్న తరహా అటవీ సంపదపై పీసాకు ఉన్న అధికారాలు, మద్యంను అరికట్టడంలో అధికారులు పాత్రను తెలిపారు. కార్యక్రమంలో ఎపియం రామాంజనేయులు, హౌసింగ్ ఎఇ శ్రీకాంత్, ఎఒ చక్రధర్, పంచాయతీ కార్యదర్శులు, పలు శాఖల అధికారులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు. శనివారం రాజవొమ్మంగి ఎంపిడిఓ కార్యాలయంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణపై సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వై.రామవరం: మండలంలో గుర్తేడు పంచాయతీ ఎగువభాగం అన్ని పంచాయతీల సర్పంచులు ఉపసర్పంచ్‌లు, పీసా గ్రామసభ ఉపాధ్యక్షులు కార్యకర్తలు, సచివాలయం సిబ్బందికి పీసా చట్టం నియమావళిపై ఎంపిడిఓ బాపన్నదొర ఆధ్వర్యంలో ఎపి ఎస్‌సిఐఆర్‌డిపిఆర్ ఎక్స్ నన్ ట్రైనింగ్‌సెంటర్ సామర్లకోట సలహా మేరకు శిక్షణ నిర్వహించారు.



రాజఒమ్మంగిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

మెనూ ప్రకారం ఆహారం అందించాలి



ఆహారపదార్థాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి:

ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి వసతిగృహం సిబ్బందిని ఆదేశించారు. రంపచోడవరం మండలం సిరిగిందలపాడు ఆశ్రమ పాఠశాలను ఎమ్మెల్యే శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విద్యార్థుల డార్మెటరీ, పరిసరాలు స్టాక్‌రూం, ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థులకు పెట్టే ఆహారం పరిశుభ్రంగా ఉండాలన్నారు. రుచిగా వండి పెట్టాలని సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు పాఠాలు ఏ విధంగా బోధిస్తున్నదీ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. హాండ్ వాష్ ఎలా చేసుకోవాలి అనేది విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సప్పర్ల వారపు సంతలో కరపత్రాలు ఆవిష్కరించిన అటవీశాఖ సిబ్బంది


పర్యావరణాన్ని కాపాడుకోవాలి

ప్రజాశక్తి -సీలేరు: అడవులకి నిప్పు పెట్టడం వలన మానవ మునుగడకే ముప్పు ఏర్పడుతుందని అటవీ శాఖ సప్పర్ల బీట్ ఆఫీసర్ రాజకుమార్ వెల్లడించారు. ఆడవాళ్లని రక్షిద్దాం పర్యావరణాన్ని కాపాడదాం అంటూ నినాదాలు చేశారు. అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు. శనివారం సప్పర్ల వారపు సంతలో విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులను సంరక్షించే బాధ్యత మనందరి పై ఉందని అవగాహన కల్పించారు. రానున్న వేసవిలో కొందరు అడవులకు నిప్పు పెడుతుంటారని దీనివల్ల అటవీసంపదకు నష్టం వాటిల్లుతుందన్నారు. ఎవరైనా అటువంటి కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు.

చిరుత సంచారంపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -సీలేరు: చిరుత పులి సంచారంపై ప్రజల అప్రమత్తంగా ఉండాలని జికె వీధి మండలం ఆర్‌వి నగర్ అటవీరేంజి సప్పర్ల బీట్ ఆఫీసర్ రాజ్ కుమార్ సిబ్బంది విస్తృతంగా శనివారం ప్రచారం చేశారు. మూడు రోజుల క్రితం సప్పర్ల రెయిన్ గేజ్ సమీపంలో చిరుత పులి సంచరించింది. ఈ క్రమంలోనే సప్పర్ల బీట్ ఆఫీసర్ రాజకుమార్ బేస్ క్యాంప్ సిబ్బంది సప్పర్ల ఘాట్ రోడ్డు పరిధిలో ఐదు కిలోమీటర్ల మేర చిరుత ఆచూకీ కోసం శనివారం ఉదయం నుంచి గస్తీ ముమ్మరం చేశారు. అయినప్పటికీ జాడ కనిపించలేదు. అనంతరం గాలికొండ పంచాయతీ పరిధి నిమ్మలగొంది, పనసల బంద, నుతిబంద, సప్పర్ల ఎరికొన్ని గ్రామాలతో పాటు వారపు సంతలో ప్రజలను అప్రమత్తం చేసామన్నారు. చిరుతను గుర్తించినట్లయితే వెంటనే అటవీ శాఖ సిబ్బందికి సమాచారం అందజేయాలని సూచించారు.

విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఎంఇఒ 1 సత్యనారాయణదొర, ప్రిన్సిపాల్ సత్యవేణి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం విద్యార్థినులకు వ్యక్తిగత పరిశుభ్రతపై ఎంఇఒ 1 కెవీవీ సత్యనారాయణదొర, పాఠశాల ప్రిన్సిపల్ సత్యవేణి అవగాహన కల్పించారు. ప్రభుత్వం వినూత్నంగా ప్రవేసపెట్టిన ముస్తాబు కార్యక్రమాన్ని పాఠశాలలో పాటించాలని తెలిపారు. దీనికోసం పాఠశాలలో ముస్తాబు కార్నర్ (రూమ్) ఏర్పాటు చేశామన్నారు. ఈ ముస్తాబు కార్యక్రమం యొక్క ఉద్దేశం, పిల్లలలో రోజువారీ పరిశుభ్రత అలవాట్లు పెంపొందించడం అన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు అప్పారావు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

'సూర్యఘర్ యోజన'ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-చింతూరు: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూర్యఘర్ వన ఐశ్వర్య గ్రీన్ ఎంటర్‌ప్రైజెస్ మేనేజింగ్ డైరెక్టర్లు శరత్ చంద్ర, రాజేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోలార్‌యూనిట్ ఇళ్లపై సులభంగా అమర్చుకోవచ్చునని ఈ పథకంలో ప్రతి ఇంటికి 3కెవి ఇన్స్టాల్ చేస్తారని, యూనిట్ విలువ 2 లక్షల10 వేలు ఉంటుందని, రూ.78 వేలు సబ్సిడీ, మిగతా నగదు స్థానిక బ్యాంకులలో రుణం పొందవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు ఎర్రంపేటలోని జిసిసి ఆఫీస్‌లో, లేదా 9491639491,9494324349 నెంబర్లను సంప్రదించాలన్నారు.



మాట్లాడుతున్న దొన్నుదొర

ప్లాస్టిక్ నివారణ అందరి బాధ్యత

ప్రజాశక్తి- అరకులోయ: ప్లాస్టిక్ నివారణ అందరి బాధ్యత అని విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్ సియ్యారి దొన్ను దొర అన్నారు. అరకులోయ నియోజకవర్గం కేంద్రంలో స్వచ్ఛంద్ర -స్వర్ణంద్ర కార్యక్రమం పై ర్యాలీ నిర్వహించి నాలుగు రోడ్ల జంక్షన్లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా దొన్నుదొర మాట్లాడుతూ, ప్లాస్టిక్ నివారణకు ప్రతి ఒక్కరు కంకణం కట్టుకోవాలని తెలిపారు. ప్లాస్టిక్ ను అంతం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్లాస్టిక్ నివారించకపోతే భవిష్యత్తులో తీవ్ర ప్రమాదం చోటుచేసుకునే అవకాశం ఉందన్నారు. పల్స్ పోలియో చుక్కమందు వేయించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అరకు నియోజకవర్గ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరి లక్ష్మి, పెదలబుడు మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టేలి దాసు బాబు, ఐసీడీఎస్ పీఓ లావణ్య, సూపర్ వైజర్‌లు లక్ష్మి, రామకృష్ణమ్మ, రత్న, డిగ్రీ కళాశాల అధ్యాపకులు, గన్నెల పి హెచ్ సి వైద్యాధికారి కనికి నాయుడు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సుబ్బారావు

మాదిగల హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలి

ప్రజాశక్తి-చింతపల్లి : రాజ్యాంగం కల్పిస్తున్న హక్కులు, సంక్షేమ పథకాల ఫలాలు అందక ఏజెన్సీ ప్రాంతంలోని మాదిగలు కేవలం ఓటర్లుగానే మిగిలిపోతున్నారని ఎమ్మార్పీఎస్ జాతీయ పొలిట్‌బ్యూరో సభ్యులు ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీలోని మాదిగల హక్కుల కోసం ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మోర్త బుజ్జి బాబు ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి సమావేశం శనివారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న చిన్న సుబ్బారావు, మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న మాదిగలకు రాజ్యాంగపరమైన రక్షణలు అమలు కావడం లేదని, అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పలు కమిటీలను ఎంపిక చేశారు. ఎంఆర్పిఎస్ అరకు పార్లమెంట్ అధ్యక్షుడిగా కుందూరు రాజు, మాదిగ జర్నలిస్ట్ ఫోరం జిల్లా అధ్యక్షుడిగా కుందూరు అప్పలరాజు, పాడేరు నియోజకవర్గ అధ్యక్షుడిగా ముసురుపాము ధారాబాబు, చింతపల్లి మండల అధ్యక్షుడిగా పెదపూడి నాగేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శిగా పుప్పాటి చిన్న అప్పారావు, నియోజకవర్గ ఇంచార్జ్‌గా చిందాడ అప్పారావు, ప్రధాన కార్యదర్శిగా కుందూరు వెంకటరావు, మహిళా కమిటీ సభ్యురాలిగా సలిక కుమారి, సభ్యులుగా గడ్డం సోమరాజు, చిందాడ రాజు, చిందాడ అపర్ణ, గజ్జెలపు సాయి లక్ష్మి ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ నిడమర్తి చినబాబు, నాయకులు పిల్లి కిరణ్, చిందాడ నూకేశ్వరరావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలి

ప్రజాశక్తి-పాడేరు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని అల్లూరి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. శనివారం ఉదయం పాడేరు మండలంలోని గుత్తులపుట్టు గ్రామ పంచాయతీలో డివిజనల్ పంచాయతీ అధికారి కుమార్ అధ్యక్షతన నిర్వహించిన స్వచ్ఛాంధ్రా స్వర్ణాంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రజలందరూ సహకరించాలని సూచించారు. ప్లాస్టిక్ నిషేధం, మొక్కలు నాటి సంరక్షించడం ప్రతీ ఒక్కరూ భాధ్యతగా తీసుకోవాలని కోరారు. పాఠశాల స్థాయి నుండి పర్యావరణ పరిరక్షణ పై అవగాహన కల్పించాలని ఆదేశించారు.పర్యావరణ రంగంలో యువత కు అనేక అవకాశాలు ఉన్నాయని రాబోయే కాలంలో పర్యావరణ రంగంలో గ్రీన్ జాబ్స్ పుష్కళంగా లభిస్తాయని పేర్కొన్నారు.
టిడిపి నియోజకవర్గం ఇంచార్జ్ గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ, పర్యావరణ సంబంధిత కోర్సులు పూర్తి చేసినవారికి దేశవిదేశాల్లో అవకాశాలు లభిస్తున్నాయన్నారు. కాలుష్య రహితంగా ఏజెన్సీ గ్రామాలను కాపాడాలని సూచించారు.గ్రామీణ నీటి సరఫరా కార్యనిర్వాహక ఇంజనీర్ నాగేశ్వరరావు, డివిజనల్ డెవలప్మెంట్ అధికారి జయప్రకాశ్, బొర్రా నాగరాజు, విజయరాణి, స్థానిక సర్పంచ్ బాబురావ్ పడాల్, లగిసపల్లి సర్పంచ్ పార్వతమ్మ, డిప్యూటీ యం పి.డి ఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు

దుంబ్రిగుడ: ఆరోగ్యకర జీవన శైలిని అవలంభించడానికి స్వచ్ఛతతోనే సాధ్యపడుతుందని ఎంపీడీఓ ప్రేమ్ సాగర్ అన్నారు. మండల కేంద్రంలో స్వర్ణాంధ్ర స్వచ్ దివాస్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీని నిర్వహించారు. మూడు రోడ్ల కూడలిలోని హైవే రహదారిలో మానవహారాన్ని చేపట్టి ప్రతిజ్ఞను చేపట్టారు.గ్రామాల పరిశుభ్రతకు అందరం తోడ్పాటునిద్దామని ఆయన పిలుపునిచ్చారు. సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, విద్యార్థులు పాల్గొన్నారు.


దుంబ్రిగుడలో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

విద్యా ప్రమాణాలు మెరుగునకు కృషి

- ●జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్
- ●పాఠశాలల్లో 'ముస్తాబు' ప్రారంభం


ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరచడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. శనివారం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, తలార్ సింగి లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా ముస్తాబు కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాలలోని వసతులు, తరగతి గదులను సందర్శించి, విద్యార్థులతో ముచ్చటించారు. మధ్యాహ్న భోజన నాణ్యత, తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ముస్తాబ్ ప్రోగ్రాంలో భాగంగా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అద్దం, దువ్వెన, వాష్ బేసిన్, ఆరోగ్య పరికరాలను పరిశీలించారు. జిల్లాలోని అన్ని పాఠశాలలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు 'ముస్తాబ్' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పాఠశాలలను రాష్ట్రంలోనే అత్యుత్తమ పాఠశాలలుగా తీర్చిదిద్దడం దీని ప్రధాన ఉద్దేశమన్నారు.పాఠశాలల ప్రాంగణాలు శుభ్రంగా ఉండటంతో పాటు, గోడలకు పెయింటింగ్స్, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడం, డిజిటల్ విద్యా బోధనకు ప్రాధాన్యత, నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యమన్నారు. నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు పి బి కె పరిమల, జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ కె రామకృష్ణారావు పాల్గొన్నారు.

తాగునీటి పథకం ప్రారంభం

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలోని గడుతూరు గ్రామంలో సర్పంచ్ కొండపల్లి అప్పలమ్మ ఆధ్వర్యంలో తాగునీటి పథకాన్ని ప్రారంభించారు. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం అందించాలనే ఉద్దేశంతో 15వ ఆర్థిక సంఘం నిధులు వెచ్చించి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ పథకంతో గ్రామంలోని ఇళ్లకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా అవుతుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు గ్రామస్తులు తాగునీటికి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. శుభ్రమైన నీరు అందుబాటులోకి రావడంతో ఆరోగ్య సమస్యలు కూడా తగ్గుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోమటి చిన్నయ్యతో పాటు ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



తాగు నీటి పథకాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-కొమ్మాది : రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... భీమిలి పెద్దవీధికి చెందిన పూసర్ల లక్ష్మణరావు (79) మధురవాడ వల్లినగర్‌లోని తన బంధువుల ఇంటికి వచ్చారు. శనివారం తెల్లవారుజామున 5:30 గంటల సమయంలో జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీ జంక్షన్ సమీపంలోని సర్వీస్ రోడ్డులో వెళుతుండగా, వేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మణరావు తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పిఎం పాలెం సిఐ జి.బాలకృష్ణ ఆదేశాల మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



లారీ బోల్తాతో రోడ్డుపై పడిన కెమికల్ పొడర్ బస్తాలు

లారీ బోల్తా - రోడ్డుపై కెమికల్ పౌడర్ బస్తాలు

ప్రజాశక్తి -గాజువాక : షీలానగర్ గొడౌన్ నుండి గాజువాక ఆటోనగర్‌కు 150 టన్నులు బరువు ఉన్న కెమికల్ పౌడర్ బస్తాలను తీసుకెళ్తున్న ట్రయిలర్ లారీ ఆటోనగర్ జాతీయ రహదారి జంక్షన్ వద్ద యూటర్న్ చేస్తుండగా బోల్తా పడింది. ట్రయిలర్‌పై ఉన్న కెమికల్ పౌడర్ బస్తాలు రోడ్డు మీద పడిపోయాయి. రోడ్డుమీద బస్తాలు పడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. గాజువాక ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించారు.

ఘనంగా పరవస్తు చిన్నయ్యసూరి జయంతి

ప్రజాశక్తి-సీతమ్మధార : పరవస్తు పద్యపీఠం, తెలుగుదండు సంయుక్త నిర్వహణలో విశాఖ పౌరగ్రంథాలయంలో పరవస్తు చిన్నయసూరి జయంతిని ఘనంగా నిర్వహించారు. సభకు డాక్టర్ బేతవోలు రామబ్రహ్మం అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పూర్వ న్యాయమూర్తి ఉప్మాక దుర్గాప్రసాదరావు, శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకులు, డాక్టర్ కెఐ.వరప్రసాదరెడ్డి, తానా పూర్వ అధ్యక్షులు డాక్టర్ తోటకూర ప్రసాద్, విజయ్ నిర్మాణ్ కంపెనీ అధినేత డాక్టర్ సూరపనేని విజయకుమార్ హాజరయ్యారు. పరవస్తు చిన్నయసూరి వ్యాకరణ పురస్కారాన్ని గురు సహస్రావధాని డాక్టర్ కడిమిళ్ల వరప్రసాదుకు ముఖ్య అతిథుల ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీత, ముఖ్య అతిథులు మాట్లాడుతూ, చిన్నయసూరి సాహితీ సేవను కొనియాడారు. బాల వ్యాకరణ వైభవాన్ని, నీతిచంద్రిక గొప్పతనాన్ని వివరించారు. తెలుగుదండు ఆధ్వర్యాన నిర్వహించిన టిట్టిభ సత్యాగ్రహం నిరసన దీక్షలో పాల్గొన్న కవులకు, కళాకారులకు, భాషాభిమానులకు వేదికపై చిరు సత్కారాలు అందజేశారు. శ్రీ హరిహర నృత్యనికేతన్ చిన్నారులు చెయ్యెత్తి జై కొట్టు తెలుగోడా గీతాలకు నృత్యం చేసి ప్రేక్షకులను అలరించారు. పరవస్తు పద్యపీఠం తెలుగుదండు అధ్యక్షుడు పరవస్తు సూరి సభాసమన్వయకునిగా వ్యవహరించారు.



జంబుఖానాలు అందిస్తున్న శ్రీసాయి పరబ్రహ్మ మిషన్ మెంబర్స్

అంగన్‌వాడీ కేంద్రాలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి- రంపచోడవరం: ఏజెన్సీలో చలి తీవ్రత ఎక్కువ కావడంతో గిరిజనులు, చిన్నపిల్లలు చలికి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని తెలుసుకుని అమెరికా నుంచి వచ్చిన బోయినపల్లి వేణుగోపాల్, అంజన ఆర్థిక సహాయంతో రంపచోడవరం మండలంలో అంగన్‌వాడీ కేంద్రానికి అదేవిధంగా మిగతా 15 అంగన్‌వాడీ కేంద్రాలకు మొత్తం 21 అంగన్వాడి కేంద్రాలకు సుమారు 30 వేల రూపాయలతో జంబుఖానాలు పంపిణీ చేశారు. ఒక అంగన్వాడి సెంటర్‌కి సీలింగ్ ఫ్యాన్ సిడిపిఒ ఉమ, శ్రీసాయి పరబ్రహ్మ మిషన్ మెంబర్స్ కెఎస్‌మూర్తి, పద్మిని, భావన చేతుల మీదుగా అందించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాఘవ అంగన్వాడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వయంఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- చింతూరు: అనకాపల్లి జిల్లా కేంద్రంలో స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా నిరుద్యోగ యువతకు అందిస్తున్న స్వయం ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సంస్థ డైరెక్టర్ రాజేశ్వరరావు తెలిపారు. తమ సంస్థ లో ఉచిత శిక్షణను పొంది అనేకమంది నిరుద్యోగులు వివిధ రంగాలలో స్థిరపడ్డారని పేర్కొన్నారు. ఈ నెల 19వ తేదీ నుండి 31వ తేదీ వరకు తమ సంస్థలో నూతనంగా సిసిటివి రిపేరు, ఇన్వాలేషన్ కోర్సుపై శిక్షణ ఇస్తామన్నారు. గడువు ముగిసినా ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాల మేరకు మరో రెండు రోజులు సమయం ఇవ్వడం జరిగిందని తెలిపారు. 18 సంవత్సరాల నుండి 45 సంవత్సరాల మధ్య గల తెల్లరేషన్ కార్డు కలిగిన నిరుద్యోగులు ఈ శిక్షణకు అర్హులని సూచించారు. శిక్షణలో వసతి, భోజనం, యూనిఫామ్ ఉచితంగా అందిస్తారన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు 8008333509 నంబర్లను సంప్రదించాలని కోరారు.

విధుల్లోకి ఎస్ఐలు

ప్రజాశక్తి- వై రామవరం: అప్పర్ పార్ట్ అయిన గుర్తేడు పోలీస్‌స్టేషన్‌కి ఎస్సై నగరికంటి రాజ్‌కోటి బాధ్యతలు స్వీకరించారు ఇప్పటివరకూ గుర్తేడులో ఎస్ఐగా విధులు నిర్వహించిన, నరసింహమూర్తి పాడేరు క్రైమ్‌నకు బదిలీపై వెళ్లారు. రాజ్‌కోటి ఇటీవలనే ట్రైనింగ్ పూర్తి చేసుకుని మొదటి పోస్టింగ్ గుర్తేడు ఎస్ఐగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో యువత చెడు మార్గాలు అనుసరించకుండా ఉండాలని గంజాయి సాగు చేసినా, రవాణా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
కూనవరం : కూనవరం ఎస్ఐగా బొడ్డు రామకృష్ణ నియమితులయ్యారు. రామకష్ణ రామవరం నుండి ఇక్కడికి అయ్యారు. ఇక్కడ ఎస్ఐ గా విధులు నిర్వర్తించిన లతాశ్రీ పాడేరు మహిళా స్టేషన్‌కి బదిలీ అయ్యారు.

ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సుల్లో అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ సంస్థలో అడ్మిషన్లు ప్రారంభించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. శనివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ తమ సంస్థకు దేశ వ్యాప్తంగా 19 నెట్‌వర్క్ కేంద్రాలు ఉన్నాయన్నారు. గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్, డాక్టోరల్ స్థాయి ప్రోగ్రాముల్లో వివిధ కోర్సులను అందిస్తున్నామన్నారు. రానున్న విద్యా సంవత్సరానికి అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్లు ప్రారంభించామని జనవరి 6 వరకు అడ్మిషన్లు జరుగుతాయన్నారు. రాతపరీక్ష ఫిబ్రవరి 8న ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు https://exams.nta.nic.in/niftee వెబ్‌సైట్ లేదా www.nift.ac.in వెబ్‌సైట్ ఫాలో కావాలన్నారు.

'సమాజంలో ప్రతి పౌరుడు బాధ్యతగా మెలగాలి'


కొయ్యూరు : వాహన తనిఖీలు చేస్తున్న సిఐ శ్రీనివాసరావు


మారేడుమిల్లి : తనిఖీలు చేస్తున్న మోటార్‌వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజేష్

ప్రజాశక్తి- కొయ్యూరు: సమాజం పట్ల ప్రతి పౌరుడు బాధ్యతగా మెలగాలని, చట్టాలను తెలుసుకోవాలని మహిళల పట్ల బాధ్యతగా ఉండాలని, మద్యం మత్తులకు బానిస అవకూడదని కొయ్యూరు సిఐ శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. శనివారం శరబన్నపాలెంలో ఒక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజం పట్ల గౌరవంగా ఉండాలని పోలీసు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, మద్యం మత్తుకు బానిసవడం వల్ల కుటుంబాలు నాశనమవుతున్నా యన్నా రు. వాహనాలు నడిపేటప్పుడు అతివేగంతో నడపవద్దని రికార్డులు కలిగి ఉండాలని హెల్మెట్ ధరించాలని ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో మంప ఎస్సై శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని భీమవరం పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద వాహనాల ను సిఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహనదారులు లైసెన్స్ కలిగి ఉండాలన్నారు.
రాజవొమ్మంగి: గ్రామస్తులు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని రాజవొమ్మంగి ఎస్సై శివకుమార్ అన్నారు.
శనివారం మండలంలోని కిమ్మలగెడ్డలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ శివకుమార్ మాట్లాడుతూ ప్రజలు నాటుసారా, గంజాయి, పేకాట, చిత్తులాట వంటి వాటి జోలికి వెళ్లి భవిష్యత్ నాశనం చేసుకోవద్దని సూచించారు. గ్రామంలో ఎవరైనా బెల్ట్‌షాపులు నిర్వహించినా, ఇతర అసాంఘిక కార్యకలా పాలకు పాల్పడినా సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.
మారేడుమిల్లి: మారేడుమిల్లిలో వాహనాలను శనివారం తనిఖీ చేసినట్టు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజేష్ తెలిపారు. తనిఖీల్లో తెలంగాణ చత్తీస్‌ఘడ్, ఒడిశా నుంచి వచ్చిన వాహనాల రికార్డులు పరిశీలించారు. సరియైన రికార్డులు లేని వాహనదారులకు జరిమానాలు విధించారు. ఘాట్‌రోడ్డుపై సీనియర్ డ్రైవర్లు మాత్రమే వాహనాలు నడపాలని, హెవీ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. వాహన తనిఖీల్లో సుమారు లక్షా 25 వేలు జరిమానాలు విధించామన్నారు.

విద్యుత్‌ను పొదుపుగా వాడాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

ప్రజాశక్తి -కొయ్యూరు: కొయ్యూరులో ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా విద్యుత్ ఉద్యోగులు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ ఎఇ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యుత్‌ను పొదుపుగా వాడాలన్నారు. ఫైవ్ స్టార్ రేటింగ్ ఉన్న విద్యుత్ పరికరాలనే వాడాలని, విద్యుత్ వాహనాలు వాడాలని, సూచించారు. ఎల్ఈడి బల్బులనే వాడాలని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పియం సూర్యగర్ పథకాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. విద్యుత్ పొదుపుగా వాడుకోవడం వల్ల భావితరాలకు మేలు జరుగుతుందన్నారు.ఈ ర్యాలీలో నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండల విద్యుత్ సిబ్బంది సబ్ ఇంజనీర్లు లైన్‌మెన్లు తదితరులు పాల్గొన్నారు.

వరి కుప్పలకు నిప్పు

ప్రజాశక్తి- వై.రామవరం: దేవరమడుగులు పంచాయతీకి చెందిన, దేవరమడుగు గ్రామంలో వరి కుప్పలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. సుమారు రెండు ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని బాధిత రైతు జర్త సోమరాజు ఆవేదన వ్యక్తం చేశారు. మండల అధ్యక్షులు పుత్తూరు కాంతరెడ్డి వారిని పరామర్శించి విషయాన్ని ఎమ్మెల్యేకి, రెవెన్యూ సిబ్బందికి తెలిపారు. సంఘటన స్థలాన్ని ఎఒ సుజాత, అగ్రికల్చరల్ అసిస్టెంట్ దినేష్ పరిశీలించారు. ఘటనకు కారకులైన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

ఆర్టీసీలో డోర్ డెలివరీ మాసోత్సవాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: ఎపిఎస్ ఆర్టీసీలో 2021లో ప్రవేశపెట్టిన కార్గో పార్సెల్, లగేజి డోర్ డెలివరీ మాసోత్సవాలను శనివారం విశాఖపట్నం ద్వారకా బస్‌స్టేషన్‌లో ఎపిఎస్ ఆర్టీసీ విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి విజయగీత ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆర్టీసి కార్గో పార్సిల్ సర్వీస్ డోర్ డెలివరీ సదుపాయం గురించి వినియోగదారులకు విస్తృతంగా తెలియజేయడం, సులభంగా సరసమైన ధరలతో ఆర్టీసి ద్వారా అందజేస్తున్నామని దీనిని వినియోగదారులందరూ వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు,చీఫ్ మెకానికల్ ఇంజనీర్ (ఎమ్అండ్ సి), విజయవాడ కె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకోవాలి

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: క్రైస్తవులు సంతోషాల నడుమ క్రిస్మస్ వేడుకలు జరుపుకోవాలని రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. మండలంలోని పలు చోట్ల శనివారం జరిగిన క్రిస్మస్ వేడుకలకు ఆమె హాజరయ్యారు. తొలుత రాజవొమ్మంగి గ్రామంలో 99 క్వార్టర్స్‌లో జరిగిన క్రిస్మస్ వేడుకలకు పాల్గొన్నారు. కార్యక్రమంలో పలు చర్చిలకు సంబంధించిన పాస్టర్లు, ఏసుక్రీస్తు భక్తులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: విశాఖపట్నం మెట్రోపాలిటన్ (ప్రాంత అభివృద్ధి సంస్థ) పరిధిలోని పర్యాటక ప్రాంతాలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్ది, ఆదాయ వనరులను పెంచేలా అధికారులు కృషి చేయాలని మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్.తేజ్‌భరత్ ఆదేశించారు. శనివారం ఆయన వీఎంఆర్‌డీఎ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు మ్యూజియంలను క్షేత్రస్థాయిలో పర్యటించి, అక్కడి వసతులను, నిర్వహణను పరిశీలించారు. ప్రధానంగా బీచ్ రోడ్డులోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలైన సబ్‌మెరైన్ మ్యూజియం, టియు-142 యుద్ధవిమాన మ్యూజియం, సీ హ్యారియర్ మ్యూజియం , యుహెచ్3హెచ్ హెలికాప్టర్ మ్యూజియంలను సందర్శించారు.

నైపుణ్యంతో మెరుగైన అవకాశాలు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: నైపుణ్యం కలిగిన యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని కాన్సెంట్రిక్స్ సంస్థ హెచ్‌ఆర్ మేనేజర్ శైలేష్ అన్నారు. విశాఖ నగరంలో తొలిసారిగా ట్రై బి ఇన్‌సి నెట్‌వర్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన నో రెజ్యూమ్ -వాక్ ఇన్ ఇంటర్వ్యూ ఉద్యోగాలు ఎంపిక కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. విశాఖ నగరంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఏకైక లక్ష్యంతో ఎటువంటి ప్రవేశ రుసుము లేకుండా ఉచితంగా నిర్వహించిన ఈ జాబ్‌మేళా విజయవంతమైంది. సిరిపురంలోని ఉడాచిల్డ్రన్ ఏరీనా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ జాబ్‌మేళాలో సుమారు 5000 మంది నిరుద్యోగ యువత పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు ఒడిశా, చత్తీస్‌ఘడ్ తదితర రాష్ట్రాలకు చెందిన 60కి పైగా సంస్థలు ఉద్యోగ నియామకాలు నిర్వహించారు. సంస్థ నిర్వాహకులు వంశీకృష్ణ, శివ మాట్లాడుతూ విశాఖలో నైపుణ్యాలు కలిగిన యువతను ఉపాధి కల్పించే సంస్థలతో తమ సంస్థ తొలిసారిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించిందని చెప్పారు. జాబ్‌మేళాలో 500 మందికి పైగా యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో సేల్స్‌మార్కెటింగ్, ఐటి, బిపిఓ వంటి సంస్థలు పాల్గొన్నాయి.

భోగాపురం ఎయిర్ పోర్టుతో బిఎస్ఎన్ఎల్ ఒప్పందం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : జివిఐఎఎల్ భోగాపురం విమానాశ్రయంలో పూర్తి స్థాయిలో టెలికాం సొల్యూషన్స్ ప్రొవజనింగ్ కార్యకలాపాలకై ఎయిర్ పోర్ట్ వారితో బిఎస్ఎన్ఎల్ ప్రత్యేకమైన ఒప్పందం కుదుర్చుకుని శనివారం దీనిపై సంతకం చేసింది. భారతదేశంలో మొట్టమొదటి సారిగా 10 సంవత్సరాలు పాటు గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాన్ని స్థాపించడానికి ఎండ్‌టు ఎండ్ పరిష్కారాలతో జరిగిన ఒప్పంద కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ నుండి ప్రిన్సిపాల్ జనరల్ మేనేజర్ జి.ఎడమ్, శ్రీకాకుళం విజయనగరం జనరల్ మేనేజర్ ఎం. నాయుడు, విశాఖపట్నం డిప్యూటీ జనరల్ మేనేజర్ (ఎంటర్ప్రైజ్ బిజినెస్) డాక్టర్‌ఎం.సత్యప్రసాద్ విజయనగరం డిజిఎం దల్నానాయుడు పాల్గొన్నారు. డాక్టర్ ఎం సత్యప్రసాద్ బిఎస్ఎన్ఎల్ తరపున ప్రజెంటేషన్ ఇచ్చారు. 5జి నెట్‌వర్క్ స్థాపన ప్రతిపాదన, విమానాశ్రయంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలతో అమలు చేయాల్సిన వినియోగ కేసులపై వివరించారు. ముఖ్యంగా విమానాశ్రయ ఆధారిత యూనిట్లకు వాయిస్, డేటా సేవలు, ఇప్పటికే ఉన్న జిఎంఆర్ మౌలిక సదుపాయాలను ఉపయోగించి ఒపెక్స్ మోడల్‌లో ఇంటర్నెట్ లీజుకు ఇచ్చిన లైన్లు, పి2 పి, ఎంపిఎల్ఎస్ కనెక్టివిటీ వగైరా వాటి గురించి వివరించారు.

నాణ్యమైన మొక్కలతో అధిక దిగుబడులు



మొక్కలను పరిశీలిస్తున్న హార్టికల్చర్ అధికారి శివరామ్

ప్రజాశక్తి - మారేడుమిల్లి : మండలంలోని కూడూరు గ్రామంలో హార్టికల్చర్ ప్లాంటేషన్ జాయింట్ కమిషనర్ సిఆర్‌డి శివరామ్ శనివారం పర్యటించారు. వివిధ మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన మొక్కలతో అధిక దిగుబడి వస్తుందన్నారు. జాఫ్రా సాగు, నిమ్మ, దబ్బ వంటి పంటల్లో పురోగతిని పరిశీలించారు. రైతులతో మాట్లాడి సాగు విధానాలు, దిగుబడులపై వివరాలు తెలుసుకున్నారు. స్థిరమైన పంటల ద్వారా రైతులకు స్థిరమైన ఆదాయం లభిస్తుందని పేర్కొన్న కమిషనర్ ప్రభుత్వం అందిస్తున్న హార్టికల్చర్ శాఖ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హార్టికల్చర్ శాఖాధికారులు, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.